క్లుప్తంగా

ఫలితాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



దేవరకద్ర: ప్రతి విద్యార్థి ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈఓ బలరాం ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని చిన్నరాజమూర్, అడవి అజిలాపూర్ గ్రామాల్లోని పాఠశాలలను ఆయన తనిఖీచేశారు. విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షించారు. ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. చదవడం, రాయడం ధారాళంగా వచ్చే చూడాలని ఆదేశించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, హరీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఆదిఆంజనేయస్వామి దేవాలయంలో కార్తీక మాస శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాఘవేందర్‌రావు తెలిపారు. స్వామివారికి 108 తమలపాకులతో, ప్రత్యేక పూలతో అలంకరించి అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా రంగరాముల జాతర



మహమ్మదాబాద్: మండలంలోని రంగరాముల గుట్టపై రంగరాముల జాతరను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కటిక నరసింహ చౌదరి బైక్ని సోమయ్య పోతినేపల్లి పెద్ద నరసింహుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నిసౌకర్యాలు కల్పించారు. శనివారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. అనంతరం యజ్ఞ కార్యక్రమాలు కూడా చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి స్వామివారి దర్శనం కోసం బారులుదీరారు. భక్తులకు మాజీ సర్పంచ్ నేరటి సునీతలక్ష్మయ్య ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం సకటోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోవర్ధన్, పద్మనాభం, కురువ అంజిలయ్య, వెంకటయ్య, మొగులయ్య, చిన్నయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కిరణ్ తెలిపారు. మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు చేపడుతున్నామన్నారు. నిమ్మబావిగడ్డ, మార్కెట్‌యార్డు, ఎస్‌వీపీ నగర్, కేపీ స్ట్రీట్, బాబిస్ట్రీట్, కూరగాయల మార్కెట్ ప్రాంతం ప్రజలు సహకరించాలని కోరారు. కొండేడ్ సబ్‌స్టేషన్ పరిధిలో కొండేడు, చిన్నఆదిరాల, పెద్దఆదిరాల, ఎక్వాయపల్లిలో కరెంట్ ఉండదని తెలిపారు.

అడ్డాకుల: మూసాపేట మండలంలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మండలంలోని అన్నిగ్రామాలకు కరెంటు సరఫరా నిలిపివేసి మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ధాన్యాన్ని మిల్లులకు పంపించండి
- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- కొనుగోలు కేంద్రాల పరిశీలన



నెల్లికొండిలో ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

చిన్నచింతకుంట: వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శనివారం మండలంలోని నెల్లికొండి, లాల్‌కోట గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపించి త్వరగా ట్యాబ్ ఎంట్రీలు చేయాలని ఆదేశించారు. రైతులు తాలు ,తేమ శాతం లేకుండ నాణ్యతతో ధాన్యాని కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సి.కృష్ణయ్య, మహిళ సమాఖ్య ఏపీఎం విష్ణుచారి, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు

కృష్ణా టెంపుల్‌చౌరస్తాను పరిశీలించిన మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పద్మావతికాలనీలోని కృష్ణా టెంపుల్‌చౌరస్తా వద్ద డ్రెయినేజీ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు ముందుకు వచ్చారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. కొన్నినెలలుగా ఈప్రాంతంలో నడిరోడ్డుపై మురుగు ఏరులైపారుతోంది. దీంతో బాటసారులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఇదే విషయం 'గుడికి వెళ్లాలంటే.. మురుగు దాటాల్సిందే!' శీర్షికన శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కమిషనర్ అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. రోడ్డుపై మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి వచ్చే కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తెలపనున్నారు. ఆయన వెంట ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ హరికృష్ణ, మున్సిపల్ జవాన్ సిరాజొద్దీన్ ఉన్నారు.



మురుగును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ బస్వరాజ్, తదితరులు

అట్టహాసంగా ఆశ్రమ వార్షికోత్సవం



సీతారాముల కల్యాణం



దీపోత్సవం ప్రారంభిస్తున్న పీఠాధిపతులు

సీతారాముల కల్యాణం, శతచండీయాగం

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం వద్ద ఉన్న మళయాళస్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం 20వ వార్షికోత్సవం పురస్కరించుకుని రెండో రోజు కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. శనివారం ఉదయం రుద్రాభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సీతారాముల కల్యాణం, శతచండీ యాగం, పల్లకిసేవ, అఖండ హనుమాన్‌చాలీసా పారాయణం, భజనలు, కార్తీక దీపోత్సవం, గణపతి హోమం జరిపించారు. మధ్యాహ్నం, సాయంత్రం రెండు వేళల ధర్మ, ఆత్మజ్ఞాన సభలు జరిపారు. సమాజంలో స్త్రీల పాత్రపై నిర్వహించిన సభలో మహిళా ప్రతినిధులే పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన అరుణదేవి సభాధ్యక్షత వహించారు. యాచారం అఖిలాంధ్రసాధు పరిషత్ పరావిద్యానందమాతాజీ, అమలాపురం బ్రహ్మానందగిరి మాతాజీ, రాజమండ్రి జ్ఞానేశ్వరిబాయి, నెల్లూరు దత్తాత్రేయ ఆశ్రమం అనంతనందగిరిమాతాఈ, హైదరాబాద్ నిత్యానందమాతాజీ, అమలాపురం పరబ్రహ్మానందగిరిమాతాజీ, జడ్చర్ల చిగుళ్లపల్లి పద్మలీలు హాజరై స్త్రీల పాత్రపై ప్రసంగించారు. సాయంత్రం నిర్వహించిన సభలో పలువురు పీఠాధిపతులు శ్రీమద్భాగవతంపై సందేశం ఇచ్చారు. వేడుకలు ఆదివారం ముగియనున్నాయి.



దీపోత్సవం

ఆన్‌లైన్ చేయిస్తున్నాం



రాజాపూర్: సర్వేలో వివరాలు నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్లు

రాజాపూర్: సమగ్ర సర్వే ఫామ్‌లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయిస్తున్నామని ఎంపీడీఓ మచ్చేందర్ తెలిపారు. శనివారం మండలంలో 61శాతం సర్వేను ఎన్యుమరేటర్లు పూర్తి చేశారు. ఇంకా రెండురోజుల్లో సర్వేను పూర్తి చేయాల్సిండగా ఒక్కో ఇంటి వద్ద 45 నిమిషాల నుంచి గంట వరకు సమయం పడుతుందని ఎన్యుమరేటర్లు చెబుతున్నారు.

కొనసాగుతున్న 'సర్వే'

నవాబుపేట: సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. శనివారం మండలంలో 1127 ఇళ్లను సర్వేచేశారు. 13815ఇళ్లకు గాను ఇప్పటివరకు 9008ఇళ్ల సర్వే పూర్తిచేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, బద్రునాయక్ తెలిపారు.

4,267 ఇళ్ల వద్ద..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో శనివారం 49వార్డుల పరిధిలోని 4,267 ఇళ్ల వద్దకు ఎన్యుమరేటర్లు వెళ్లి ఆయా కుటుంబ యజమానులతో పూర్తి సమాచారం సేకరించారు. ఇక మొత్తం 78,696 ఇళ్లకు గాను ఇప్పటివరకు 34,079ఇళ్లకు సంబంధించిన వివరాలు తీసుకోగలిగారు.



మహబూబ్‌నగర్‌లోని న్యూటౌన్‌లో ఓ ఇంటి వద్ద సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్

ఒలింపిక్స్ క్రీడల అభివృద్ధికి కృషి

ఒలింపిక్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహ్మా, రజనీకాంత్‌రెడ్డి



ఒలింపిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులును సన్మానిస్తున్న స్టేడియం మిత్రబృందం సభ్యులు

జిడ్డీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో ఒలింపిక్స్ క్రీడల అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని ఒలింపిక్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహ్మా, రజనీకాంత్‌రెడ్డి అన్నారు. స్టే గ్రౌండ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో శనివారం స్టేడియం గ్రౌండ్‌లో ఇటీవల జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికై వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒలింపిక్స్ వైపు యువత రావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమపిల్లలను క్రీడలు ఆడేలా ప్రోత్సహించాలని కోరారు. చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమనే విషయం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో స్టేడియం గ్రౌండ్ మిత్ర బృందం సభ్యులు విజయ్, కిషోర్, మురళీ, సురేష్, నరేందర్, బుచ్చన్న, నగేష్, తిరుపతి, మల్లేష్, శ్రావన్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

రాజాపూర్: రైతులు కొనుగోలు కేంద్రానికి తాలులేకుండా నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. బాలానగర్ మండలంలోని ఉడిత్యాల, రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి, ఏఓ ప్రదీప్‌గౌడ్, ఏఈఓ శ్రీనివాస్, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ మల్లేష్‌గౌడ్, నాయకులు నరహరి, రమేష్‌నాయక్, మోహన్‌నాయక్, శ్రీశైలంయాదవ్, గోవర్ధన్‌రెడ్డి, నర్సింలు, నసీర్, రమణ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

క్రీడల్లో ఉన్నత శిఖరాలను చేరాలి

దేవరకద్ర: క్రీడల్లో విద్యార్థులు మరింతగా రాణించి ఉన్నత శిఖరాలకు చేరాలని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. జోనల్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను శనివారం అభినందించారు. అండర్ 19 కేటగిరీ అథ్లెటిక్స్‌లో ఆరిఫ్, చరణ్ రెండో స్థానం మణిశంకర్ మూడో స్థానాన్ని కై వసం చేసుకున్నారు. కబడ్డీ అండర్ 17 లో రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. సురేందర్, భరత్, విష్ణు, అశోక్, ఉదయ, ప్రవీణ్. శివ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ట్రోఫీలు తెచ్చిన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందనలు తెలిపింది.



క్రీడల్లో రాణించిన విద్యార్థులతో అధ్యాపకులు

ముగిసిన నాటక ప్రదర్శనలు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి జాతరలో నిర్వహించిన నాటక ప్రదర్శనలు శనివారం ముగిశాయి. భాషసాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం, కలీమ్ కల్చరల్ థియేటర్ వారి ఆధ్వర్యంలో రెండురోజుల పాటు ఈప్రదర్శనలు సాగాయి. మొదటిరోజు శుక్రవారం ధనం మూలం ఇదం జగత్ జానపద సంగీత నాటికం రెండోరోజు శనివారం రామాంజనేయ యుద్ధం నుంచి యుద్ధఘట్టం నాటికను ప్రదర్శించారు. అనంతరం కళాకారులను ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డిలతో పాటు పలువురు అభినందించి శాలువాలతో సన్మానించారు.



సన్మానం పొందిన కళాకారులు

ఆకట్టుకున్న సదర్ ఉత్సవం

జడ్చర్ల టౌన్: సదర్ ఉత్సవంలో గేదెల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మండలంలోని పెద్దపల్లి గ్రామంలో శనివారం రాత్రి యాద వసంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్స వం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీసీజాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరిసర గ్రామాలనుంచి యాదవులు అధికసంఖ్యలో హాజరయ్యారు.



పెద్దపల్లిలో సదర్ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు జర్నలిస్టులు

దేవరకద్ర: ప్రజలకు. ప్రభుత్వానికి వారధులుగా పాత్రికేయులు పనిచేస్తారని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. శనివారం జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో విలేకరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించారు. జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ పాత్రికేయులను శాలువాలు కప్పి సన్మానించారు. పాత్రికేయులు శ్రీనివాసులు, ఎల్లప్ప, ప్రాణేశ్, రఘువీర్, సంతోష్, రాజేందర్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవ స్వామిని శనివారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి అభిషేక్‌రెడ్డి సతీమణి దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆమెకు ఆశీర్వచనం ఇచ్చారు.

పాఠశాలకు సామగ్రి అందజేత



పాఠశాలకు సామగ్రి అందజేస్తున్న దాతలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హైదరాబాద్‌కు చెందిన దాతలు రాజేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు కలిసి రూ.50 వేలు విలువజేసే సామగ్రిని శనివారం ఏనుగొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అందజేశారు. వీటిలో కంప్యూటర్, ప్రింటర్, టీవీ, ఆట వస్తువులు ఉన్నాయి. ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్, షాషాబ్‌గుట్ట, ఏనుగొండ పాఠశాలల హెచ్‌ఎంలు సేవ్య, ఎస్.రాధ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

స్టేషన్ మహబూబ్‌నగర్: హన్వాడ మండలం మునిమోక్షం గ్రామానికి చెందిన బీజేపీ గ్రామఅధ్యక్షుడు దండు శ్రీనుతో పాటు పలువురు శనివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, నవనీత, నాగరాజు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

'దళితుల ఐక్యత కోసమే పాదయాత్ర'

మహబూబ్‌నగర్ రూరల్: దళితుల ఐక్యత కోసమే మాలల మహాపాదయాత్ర కొనసాగుతోందని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కో-ఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో మాల మహానాడు ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని పెంచే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. రాజ్యాధికారమే లక్ష్యంగా రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో చేపట్టిన పాదయాత్ర 500 కిలోమీటర్లు పూర్తయిందని తెలిపారు. ప్రతి గ్రామంలో పాదయాత్రకు ఘన స్వాగతం లభించిందన్నారు. ఈయాత్ర అక్టోబర్ 25న భద్రాచలంలో ప్రారంభమై 16 జిల్లాల మీదుగా 36నియోజకవర్గాలలో కొనసాగుతూ డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల మహా సంగ్రామ సభతో పూర్తవుతుందన్నారు. ఈసభకు లక్షలాదిగా మాలలు, మాల ఉపకులాలు తరలిరావాలని కోరారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జి.చిన్న, నాయకులు దాసు, ఆంజనేయులు, సత్తయ్య, వెంకట్రాములు, రామచంద్రయ్య, శ్రీనివాస్, యాదగిరి, శేఖర్, ఆనంద్, మహేందర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు బాబాకు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఆర్థికసాయం అందజేశారు. బాబా కొన్నాళ్ల క్రితం పక్షవాతానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న అచ్చాయపల్లి మాజీ సర్పంచ్ బోయిని చంద్రశేఖర్ రూ.5వేలు, వేములకి చెందిన రవీందర్‌గౌడ్ రూ.2వేలను బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ మాజీ సభ్యుడు మదీనా జమీర్, కొండయ్య, శివరాములు తదితరులు ఉన్నారు.